ఘనంగా ఏఎన్‌ఆర్ జయంతి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం కల్చరల్: స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. అనంత అక్కినేని అభిమాన సంఘాలు, క్లాస్ ఆర్కెస్ట్రా సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి డీఆర్వో మలోల, ఆర్డీవో కేశవనాయక్, మునిసిపల్ అసిస్టెంట్ కమీషనర్ రంగస్వామి, సామాజిక సేవా కార్యకర్త కొప్పుల రమణ, ఘంటసాల ఆరాధన సమితి జీవీరామయ్య హాజరయ్యారు. గాయనీగాయకులు పాలసముద్రం నాగరాజు, రామాంజి, శ్రీదేవి, బృంద, విజయలక్ష్మి, ఆచార్య సుధాకరబాబు తదితరులు అక్కినేని మధుర గీతాలతో శ్రోతలను ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో అభిమాన సంఘాల నిర్వాహకులు మురుగన్, భరత్, గాంగే నాయక్, రియాజుద్దీన్, సుధాకరమూర్తి పాల్గొన్నారు.

ఇమ్రాన్ చిస్తీ ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనకు వచ్చిన ఇమ్రాన్ చిస్తీ

అనంతపురం కల్చరల్: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఆజ్మీర్ దర్గా స్వామి ఇమ్రాన్ చిస్తీ ఆదివారం అనంత పర్యటనకు విచ్చేశారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి వేముల అబూజర్ నదీమ్ అహమ్మద్ స్వగృహానికి ఆదివారం ఇమ్రాన్ చిస్తీ విచ్చేశారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ బలోపేతానికి, రాబోవు ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడానికి ప్రత్యేక దువా చేశారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, వసీం అక్రమ్, సాద్ అహమద్, ఉమర్ ఫారూఖ్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్ల విడుదల

అనంతపురం కల్చరల్: వాసవీమాత ఆలయంలో ఈసారి మరింత వైభవంగా దసరా వేడుకలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు తెలిపారు. ఆదివారం స్థానిక కొత్తూరు అమ్మవారిశాలలో సంఘం ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈనెల 22 నుంచి వచ్చేనెల 2 వరకు జరిగే ఫ్లెక్సీలు విడుదల చేశారు.

బాధితులపైనే కేసులా?


గాయపడిన గోసల ఎర్రమ్మ

ఆత్మకూరు: 'కూటమి ప్రభుత్వంలో రోజు రోజుకు దాడులు పెరిగిపోతున్నాయి. దీనికి తోడు బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారు'. అని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడుతున్నారు. ఆత్మకూరు మండలంలోని తలుపూరుకు చెందిన దంపతులు గోసల కొండన్న, గోసల ఎర్రమ్మపై టీడీపీ నేతలు శనివారం సాయంత్రం దాడి చేయడంతో ఎర్రమ్మకు 16 కుట్లు పడ్డాయి. కొండన్న కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా.. ఎర్రమ్మ ఫిర్యాదు మేరకు 13 మందిపై కేసులు నమోదు చేశారు. అయితే గాయపడిన వైఎస్సార్‌సీపీకి చెందిన 10 మందిపై కేసులు ఎలా నమోదు చేయడంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళ ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలో ఇలా టీడీపీ నేతలు బరితెగించి మహిళల తలలు ఎలా పగలకొడుతారని ఎంపీపీ హేమలత మండిపడ్డారు. అధికారం ఉందని, దాడులకు తెగపడటం హేయమని వైస్ ఎంపీపీ విజయకుమార్‌నాయక్ అన్నారు. పొలంలో పనిచేస్తుండగా తనతో పాటు తన భార్య ఎర్రమ్మ, మరో వ్యక్తిపై కర్రలతో దాడి చేశారని బాధితుడు కొండన్న చెబుతున్నారు. దాడి చేయడంతో పాటు తమపైనే మళ్లీ కేసులు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. గొడవ జరిగిన ప్రదేశంలో ముగ్గురం ఉంటే పది మందిపై కేసులు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. కేవలం టీడీపీ నేతల ప్రోద్బలంతోనే కేసులు నమోదు చేశారన్నారు. ఘటనపై ఎస్‌ఐ లక్ష్మణరావును వివరణ కోరగా దాడి చేసుకున్న ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామన్నారు. ఎర్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 13 మందిపై, ప్రభావతి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 10 మందిపై కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు.

సందడిగా అపూర్వ సమ్మేళనం


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని నేతాజీ సుభాస్ చంద్రబోస్ స్కూల్‌లో 1990–91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా సాగింది. ఆత్మీయ ఆలింగనాలు, పలకరింపులతో సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఈ పూర్వ విద్యార్థుల కలయికకు మల్లె చిన్నరామప్ప, పయ్యావుల రామాంజనేయులు, రేపటి రామాంజనేయులు, ఖాజా మొహిద్దీన్, శివప్రసాద్, బసవరాజు, చిరంజీవి నాయకత్వం వహించారు.

27 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక



రాప్తాడు: మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ లో 1998–1999 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని ఎంతో సంతోషంగా పడిపారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి రెండు బీరువాలు, నాలుగు టెబుల్స్, 50 కుర్చీలు, 70 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌ను హెచ్‌ఎం రామచంద్రారెడ్డికి అందజేశారు.

సంక్షిప్త సమాచారం

మిట్టా ఆంజనేయులు సేవలు చిరస్మరణీయం

అనంతపురం కల్చరల్: సంస్కృత పండితుడు మిట్టా ఆంజనేయులు జీవితం ఆదర్శప్రాయమని వక్తలు అన్నారు. ఇటీవల మరణించిన ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మిట్టా ఆంజనేయులు సంతాప సభ ఆదివారం కొత్తూరు అమ్మవారి శాలలో జరిగింది. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు మచ్చా నరసింహులు, ఆర్యవైశ్య,యువజన, మహిళా మండలి నాయకులు పాల్గొన్నారు.

17న నిరుద్యోగి ఆవేదన సదస్సు

అనంతపురం అర్బన్: యువతకు ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అమలుకు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 17న విజయవాడలో 'నిరుద్యోగి ఆవేదన సదస్సు' నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో సదస్సు పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. నాయకులు దేవేంద్ర, వంశీకృష్ణ, ధనుంజయ, శ్రీనివాసులు, నాయక్, తేజ తదితరులు పాల్గొన్నారు.

వద్దుపల్లి టోల్‌గేట్ వద్ద వాగ్వాదం

ఆత్మకూరు: వద్దుపల్లి టోల్ గేట్ వద్ద వాగ్వాదం జరిగింది. ఆదివారం ఆత్మకూరుకు చెందిన ఓ వాహనం టోల్‌గేట్‌వద్దకు రాగా, ముందు మరో వాహనం ఉంది. ఆకారు ఫాస్టాగ్‌లో నగదు లేక ముందుకు వెళ్లలేదు. దీంతో వెనుక ఉన్న వాహన డ్రైవర్ అక్కడున్న సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. మాటా మాటా పెరిగి, బూతులు తిట్టుకున్నారు. ఇదంతా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటరర్లు, నేర చరిత్ర ఉన్న వారికి పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

మంచి నాయకుడిని కోల్పోయాం


భాస్కర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న గోరంట్ల మాధవ్

అనంతపురం ఎడ్యుకేషన్: తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి ఆకస్మిక మృతితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక నిబద్ధత, నిజాయతీ గల నాయకుడిని కోల్పోయిందని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ అన్నారు. ఆదివారం రామచంద్రనగర్‌లో తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భాస్కర్‌రెడ్డి అందరితో కలుపుగోలుగా ఉండేవాడని అన్నారు.

నూతన కమిటీకి సన్మానం

అనంతపురం కల్చరల్: కాశీవిశ్వేశ్వరాలయం నూతన కమిటీ సభ్యులను జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు అభినందించారు. ఆదివారం చైర్మన్‌గా ఎంపికైన నరేంద్ర చౌదరిని కలిసి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సీవీ మురళీధర్, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు, సంఘం ప్రతినిధులు శేషశయన, నారాయణరావు, నాగభూషణరావు తదితరులు సన్మానించారు.

ఇంజినీరింగ్ మేధావి మోక్షగుండం

- నేడు విశ్వేశ్వరయ్య జయంతి


జేఎన్‌టీయూ కళాశాల

అనంతపురం /అనంతపురం కల్చరల్: దేశ సమగ్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే ఇంజినీర్లకు మార్గదర్శిగా, భారతజాతి కీర్తి ప్రతిష్టలు సుసంపన్నం చేసిన మహోన్నత వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా మిగిలిపోయాయి. ఏటా సెప్టెంబర్ 15న మోక్షగుండం జయంతి సందర్భంగా ఇంజినీర్స్‌డేను జరుపుకుంటారు.

కరువు సీమలో సాంకేతిక కల్పతరువు..

మోక్షగుండం స్ఫూర్తితో ఆయన అందించిన ప్రేరణతో దేశమంతటా అపురూప కట్టడాలు రూపుదిద్దుకున్నాయి. అనంతలోనూ నాటి ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పట్టే కట్టడాలు ఎన్నో ఉన్నాయి. ఆర్ట్స్ కాలేజీ, జిల్లా కోర్టు ప్రాంగణం, రెవెన్యూ భవనాలు చెక్కుచెదరని, అద్భుత కట్టడాలుగా నిలిచాయి. అందులో అనంత కరువు సీమలో సాంకేతిక కల్పతరువుగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూఏ 1949లో ప్రారంభమైంది. 2008లో వర్సిటీగా ఆవిర్భవించింది. ఏటా 90 వేల మందికి పైగా విద్యార్థులు జేఎన్‌టీయూ పరిధిలో చదువుకుంటూ భావి ఇంజినీర్లుగా వస్తున్నారు. వైఎస్సార్ సీఎం కాకమునుపు నూటికొకరు ఇంజినీర్లు ఉండేవారు. ఇంజినీర్ కావాలన్న ప్రతి ఒక్కరి కల సాకారం చేసిన ఘనత వైఎస్సార్‌దే. ఆయన హయాంలో ఇంజినీరింగ్ కళాశాలలను విరివిగా పెంచారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించి ఎందరినో ఉన్నత విద్యావంతులను చేశారు. ప్రతిభావంతులైన అనంతపురం ఇంజినీర్లు వినూత్న ఆవిష్కరణలతో రాష్ట్రంలోనే తలమానికంగా నిలిచారు. ప్రస్తుత రోజుల్లో కేవలం ఇంజినీరింగ్ మాత్రమే ప్రధాన ఉపాధిగా మారడం వెనుక ఆయన కృషి అపారం.

అభాగ్యురాలికి 'అమ్మ' ఆసరా


ఆర్థిక సాయం అందిస్తున్న 'అమ్మ' రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోని నాయక్ నగర్‌కు చెందిన చాకలి సావిత్రమ్మ మెరుగైన చికిత్స కోసం 'అమ్మ' సంస్థ తరిమెల రమణా రెడ్డి ఆదివారం ఆర్థిక సాయం అందించారు. సావిత్రమ్మకు గుండెనొప్పి రావడంతో బైపాస్ సర్జరీకి, మందులకు రూ.3 లక్షలకుపైగా ఖర్చవుతుందని తెలియడంతో అమ్మ సంస్థ రమణారెడ్డిని సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి సర్జరీ కోసం రూ.లక్ష , మరో రూ.20 వేలు హైదరాబాద్‌కు వెళ్లడానికి ఆర్థిక సాయం అందించారు.

పూర్వ విద్యార్థికి సన్మానం


రమణను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీ హోటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఎస్ఎస్ ఫ్యామిలీ రెస్టారెంట్ కె.రమణను పూర్వ విద్యార్థులు సన్మానించారు. నగరంలోని పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో 1984–85లో రమణ పదో తరగతి చదివాడు. పూర్వ విద్యార్థులు పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేశారు.

వైభవంగా కోటి కుంకుమార్చన

అనంతపురం కల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణమంటపంలో మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమం ఆధ్వర్యంలో లలిత పరమేశ్వరిదేవి కోటి కుంకుమార్చన ఆదివారం నిర్వహించారు. ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధి ప్రమోద్‌కుమార్ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి డీఆర్‌ఓ మలోల, విశ్వశాంతి ఆశ్రమం జిల్లా ప్రతినిధులు శ్యామలమ్మ, సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ మాట్లాడారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సువర్ణ, కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయ ప్రతినిధులు విజయ్‌కుమార్, టీటీడీ సుధాకరరెడ్డి, లహరిరాజ్, అవోపా జయంతి శ్రీనివాసుశెట్టి, సాయి, కట్ట పరమేష్ పాల్గొన్నారు.